రాచన్నస్వామి ఆలయంలో పూజలు చేసిన జడ్జి లలితాదేవి

ఆలయంలో జడ్జి పూజలు

కోహీర్, మే 17: మండలంలోని బడంపేట రాచన్నస్వామి ఆలయంలో జహీరాబాద్ సీనియర్ సివిల్ కోర్టు జడ్జి గంట లలితాదేవి ప్రత్యేక పూజలు చేశారు. జడ్జి లలితాదేవి శనివారం ఆలయాన్ని సందర్శించి గర్భగుడిలోని శివలింగానికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ఆవరణలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు దయానంద్‌పాటిల్, జగదీశ్వర్‌స్వామి, శివానంద్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాయికోడ్ ఎంఈవోగా మనయ్య

రాయికోడ్, మే 17: మండల ఎంఈవోగా పనిచేసిన అంజయ్య ఉద్యోగ విరమణ చేయడంతో నూతన ఎంఈవోగా మనయ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంఆర్సీ కార్యాలయంలో నూతన ఎంఈవో మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను బలోపేతానికి కృషి చేస్తామన్నారు. ప్రతిఒక్కరూ తప్పకుండా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలన్నారు. ప్రభుత్వం చిన్నారులకు అవసరమైన వసతులు కల్పిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎవరైనా ప్రైవేట్ పాఠశాలలు ఏర్పాటు చేసుకుంటే తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. తరగతి గదుల్లో సరైన వసతులు కల్పించుకోవాలని, పాఠశాలల బస్సులను పూర్తిస్థాయిలో సరిచేసుకోవాలని ఆదేశాలు జారీచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింహులు, ఖైరత్ అలీ, శ్రీనివాస్, జనార్దన్, ఎంఆర్సీ సిబ్బంది ఉన్నారు.

దుకాణాల టెండర్ గడువు పెంపు

అందోల్, మే 17: జోగిపేట వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలోని దుకాణాల వేలంపాట గడువును ఈనెల 23 వరకు పొడిగించినట్లు మార్కెట్ కార్యదర్శి సునీల్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యార్డ్ ఆవరణలోని కమర్షియల్ దుకాణం నెం 21(బీసీ) 31 నెం(జనరల్) నెలవారీ అద్దె ప్రతిపాదికన ఆన్‌లైన్ టెండర్ ద్వారా కేటాయించామని రూ.వెయ్యి చెల్లించి ఫారం పొందాలన్నారు. వివరాలకు 7330733541 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఇంటర్‌లో ప్రవేశానికి 20న కౌన్సెలింగ్

నారాయణఖేడ్, మే 17: నారాయణఖేడ్ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయంలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కోసం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ యాదగిరి తెలిపారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో పరిమిత సీట్ల భర్తీ కోసం ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 20వ తేదీన ఉదయం10 గంటలకు గిరిజన సంక్షేమ గురుకులంలో నిర్వహించనున్న కౌన్సెలింగ్‌కు పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

గుమ్మడిదల ఎస్సైగా భరత్‌భూషణ్

గుమ్మడిదల,మే17: గుమ్మడిదల ఎస్సైగా భరత్‌భూషణ్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎస్సైగా పని చేసిన మహేశ్వర్‌రెడ్డి బదిలీపై వెళ్లగా బీడీఎల్ భానూర్ ఠాణాలో ఎస్సైగా విధులు నిర్వహించిన భరత్‌భూషణ్ గుమ్మడిదల పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. పోలీస్ సిబ్బంది కొత్తగా వచ్చిన ఎస్సైని స్వాగతించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల కోసం కృషి చేస్తానని తెలిపారు.

రెండు నెలలకే ధ్వంసమైన సీసీ రోడ్డు

జిన్నారం, మే 17: లక్షల రూపాయలతో నిర్మించిన రోడ్లు ఇవేనా అంటూ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా నిర్మించిన సీసీ రోడ్లు రెండు నెలలు గడవకముందే ధ్వంసమవుతున్నాయని వాపోతున్నారు. గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని అలీనగర్ తెలంగాణ కాలనీలో సీసీ రోడ్డు నిర్మించి రెండు నెలలు గడవకముందే ధ్వంసమైందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. పగుళ్లు ఏర్పడిన రోడ్డుపై రాత్రింబవళ్లు ప్రయాణం ఇబ్బందికరంగా మారిందని, సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న సెక్యూలిటీ సిబ్బంది

అక్రమ నిర్మాణాలు కూల్చివేత

జిన్నారం, మే 17: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని హుడా స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో హుడా స్థలాల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని పేర్కొంటున్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలో నిర్మించిన అక్రమ నిర్మాణాన్ని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సెక్యూరిటీ సిబ్బంది కూల్చివేశారు. హుడా సర్వే నంబర్లలో అధికారులు సమగ్రంగా సర్వే నిర్వహించి ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

డిగ్రీ ఫెయిలైన విద్యార్థులకు మరో అవకాశం

అందోల్, మే17: జోగిపేట నెహ్రూ మెమోరియల్ డిగ్రీ కళాశాలలో 2016-17 నుంచి 2019-20 బ్యాచ్‌లో 1వ సెమిస్టర్ నుంచి 6వ సెమిస్టర్ వరకు పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులు బ్యాక్‌లాగ్స్ రాసేందుకు ఉస్మానియా విశ్వవిద్యాలయం అనుమతినిచ్చిందని కళాశాల ప్రిన్సిపాల్ డా.రమేశ్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఎలాంటి ఫైన్ లేకుండా మే 19 వరకు ఫైన్‌తో 29 వరకు పరీక్ష ఫీజులు చెల్లించే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు ఈ విషయాన్ని గుర్తించి సకాలంలో ఫీజులు చెల్లించి పరీక్షలకు హాజరుకావాలన్నారు. మరిన్ని విషయాల కోసం కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

ప్రారంభోత్సవానికి సిద్ధమైన రైల్వే ఫ్లైఓవర్

- రూ.100 కోట్లతో బ్రిడ్జి నిర్మాణ పనులు
- తొలగనున్న తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర వాహనదారులు, ప్రజల ట్రాఫిక్ కష్టాలు
- వచ్చే వారంలో ప్రారంభోత్సవానికి సన్నాహాలు

జహీరాబాద్ పట్టణంలోని ఈద్గా సమీపంలో ప్రారంభోత్సవానికి సిద్ధమైన రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి

జహీరాబాద్ ఈద్గా సమీపంలో రైల్వే గేటు వేయడంతో నిలిచిపోయిన వాహనాలు

జహీరాబాద్, మే 17: జహీరాబాద్‌లోని ఈద్గా సమీపంలో రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ట్రాఫిక్ సమస్యతో సతమతమవుతున్న తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంత ప్రజలు, వాహనచోదకుల కష్టాలు తీరనున్నాయి. హైదరాబాద్-ముంబయి మార్గాలకు వెళ్లే 65వ జాతీయ రహదారిపై ఆయా రాష్ట్రాలకు చెందిన ప్రజలు, వాహనచోదకులు ప్రతిరోజూ పట్టణంలోని ఈ రోడ్డు మార్గం గుండా రాకపోకలు సాగిస్తుంటారు. ఈద్గా సమీపంలో రైల్వే లైన్ ఉండడంతో రైళ్ల రాకపోకలు సాగించే సమయంలో సంబంధిత సిబ్బంది గేటు మూసివేస్తుంటారు. ఈ రైల్వే లైన్ మీదుగా సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లోని జహీరాబాద్, కోహీర్, మెటల్‌కుంట, కర్ణాటకలోని బీదర్, ఉద్గీర్, నాందేడ్, పూర్ణ, శిరిడీ, బెంగళూర్, తిరుపతి, కాకినాడ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రతి 10-15 నిముషాలకు ఒక సారి ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లతోపాటు గూడ్స్ రైళ్లు కూడా వెళ్తుంటాయి. ఆ సమయంలో రైల్వే సిబ్బంది గేటు వేయడంతో ఇరువైపులా వందలాది వాహనాలు నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీంతో కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ జాం కావడంతో గేటు దాటేందుకు ఆర గంటకుపైగానే సమయం పట్టేది.

రూ.100 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం

ఆయా రాష్ట్రాలకు చెందిన వాహనదారులు, ప్రజల ఇబ్బందులను గుర్తించి రైల్వే గేటు వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు బీఆర్ఎస్ పాలనలో మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రూ.100 కోట్లు మంజూరు చేయించారు. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్ అప్పట్లో రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి, సీసీ రోడ్లు తదితర పనులను వేగవంతంగా చేపట్టారు. ఆ తర్వాత బిల్లులు సకాలంలో రాకపోవడంతో పనులు నత్తనడకన సాగాయి. పలుమార్లు సంబంధిత అధికారులు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకొచ్చి పనులు కొనసాగేలా చేశారు. ఆ తర్వాత కూడా చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు మళ్లీ కాంట్రాక్టర్‌కు చెల్లించకపోవడంతో నిలిపివేశారు. రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులను నిలిచిపోవడంతో ఈ మార్గం గుండా రాకపోకలు సాగించే ప్రజలు, వాహన చోదకుల ఇబ్బందులు పడుతుండంతో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బిల్లులు మంజూరు చేయించారు. దీంతో కాంట్రాక్టర్ ఫ్లైఓవర్ బ్రిడ్జితో, సర్వీసు రోడ్డుతోపాటు రెండు వైపులా రహదారి అనుసంధానం, డివైడర్, మొగుడంపల్లికి వెళ్లే చౌరస్తాలో సీసీ రోడ్డు, బీదర్ చౌరస్తాలో రోడ్డు విస్తరణ పనులను చేపట్టారు. రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిపై లైటింగ్, రోడ్డు మార్గంలో భద్రత చర్యల కోసం సైనింగ్ బోర్డులను సైతం ఏర్పాటు చేశారు. దీంతో ఫ్లైఓవర్ ప్రారంభానికి సిద్ధమైంది. వచ్చేవారంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా రైల్వే గేటు వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జిని ప్రారంభించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

22 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి కలెక్టరేట్, మే 17: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 22 నుంచి 28వరకు జరగనున్నాయని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ స్పష్టం చేశారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 28 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఎక్కడా సమస్యాత్మక కేంద్రాలు లేవని స్పష్టం చేశారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించడంతోపాటు పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించామన్నారు. పరీక్షలు జంబ్లింగ్ విధానంలో నిర్వహించనున్నందున విద్యార్థులు ముందస్తుగా తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాలను ఒకరోజు ముందుగానే చూసుకోవాలన్నారు. ఆదివారం కూడా పరీక్ష ఉంటుందనే విషయాన్ని విద్యార్థులు గమనించాలన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పరీక్షలు సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారని, కేంద్రాలకు దగ్గరలో ఉన్న జీరాక్స్ కేంద్రాలను మూసివేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. ఎక్కడ ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆర్డీవోలు తమ పరిధిలోని కేంద్రాలను విధిగా పరిశీలించాలని సూచించామన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లకు అనుమతి లేదన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవింద్ రామ్, అధికారులు పాల్గొన్నారు.

గుమ్మడిదల, మే17: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు యావన్నగారి సంతోష్‌రెడ్డి శనివారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను, మాజీ మంత్రి హరీశ్‌రావును మర్యాదపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సంతోష్‌రెడ్డిని కోరారు.

సమ్మర్ క్యాంప్‌లతో విద్యార్థులకు మేలు

ఉస్మాన్‌నగర్ సమ్మర్ క్యాంప్‌లో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు

రామచంద్రాపురం, మే 17: సమ్మర్ క్యాంప్‌లతో విద్యార్థులకు మేలు జరుగుతుందని తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరిగారి రమణ అన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్‌లో ఉన్న బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్‌లో టీనా ఆధ్వర్యంలో మూడు వారాలుగా సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 100మంది విద్యార్థులకు సమ్మర్ క్యాంప్‌లో వివిధ అంశాలపై నిర్వాహకులు శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా టీనా అధ్యక్షుడు రమణ మాట్లాడుతూ ప్రతి ఏడాది ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులను ఎంపిక చేసి సమ్మర్ క్యాంప్ ఏర్పాటు చేసి విద్యార్థులకు వివిధ రంగాల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్చుకోవడానికి సమ్మర్ క్యాంప్ దోహదపడుతుందన్నారు. నిర్వాహకులు చెప్పే అంశాలను విద్యార్థులు చక్కగా నేర్చుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో కవిత, ప్రత్యూషశర్మ, అరుణ, విజయదామోదరన్, సుజాత, రాజ్‌కుమార్, రామమూర్తి ఉన్నారు.

30 ఏండ్లు పైబడిన వారికి హైపర్ టెన్షన్ స్క్రీనింగ్

సిర్గాపూర్, మే 17: జిల్లాలో 30 ఏండ్లు పైబడిన వారందరికీ హైపర్ టెన్షన్ స్క్రీనింగ్ నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో గాయత్రీదేవి తెలిపారు. శనివారం సిర్గాపూర్ మండలాన్ని సందర్శించిన ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా శనివారం ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 87,780 మంది హైపర్ టెన్షన్ కలిగి ఉన్నారని, వీరందరికి ఉచితంగా మందులు సరఫరా చేస్తూ చికిత్సలందిస్తున్నట్లు చెప్పారు. హైపర్ టెన్షన్ వల్ల గుండెపోటు, రక్తప్రసరణ నిలిచి పక్షవాతం వచ్చే అవకాశం ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా దీనిపై ప్రత్యేక అవగాహన చేపట్టినట్లు పేర్కొన్నారు. హైపర్ టెన్షన్ ఉన్న వారు ఆహారంలో మార్పులు, వ్యాయామం తప్పనిసరి చేయాలన్నారు. శరీరానికి తప్పకుండా శ్రమ అవసరమని, ఆహారం అలవాట్లను కూడా మార్చుకోవాలని సూచించారు. ఆమె వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో సంధ్యారాణి, డా.నాగమణి, ఎంపీహెచ్ఏ భాస్కర్, వైద్య సిబ్బంది ఉన్నారు.

చికున్‌గున్యా పాజిటివ్ కేసుల్లేవు

పేషెంట్లతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

సిర్గాపూర్, మే 17: చికున్‌గున్యాకు సంబంధించి పాజిటివ్ కేసులు లేవని డీఎంహెచ్‌వో గాయత్రీదేవి అన్నారు. శనివారం ఆమె మండలంలోని రూప్లాతండాను సందర్శించి కొనసాగుతున్న వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈమేరకు మెడికలాఫీసర్ నాగమణితో జ్వరాల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఇంటింటికీ చేపట్టిన సర్వే నివేదికలను కూడా పరిశీలించారు. అనంతరం స్థానికులతో మాట్లాడి ఏయో వ్యాధులు వచ్చాయి, ఎక్కడ చికిత్స చేయించుకున్నారనే విషయాలు అడిగి తెలుసుకున్నారు. మూడు వారాల నుంచి జ్వరం, కాళ్లు, చేతులు నొప్పులతో బాధపడినట్లు స్థానికులు తెలిపారు. అప్పుడే తక్కువ, ఎక్కువగా వ్యాధి వ్యాప్తి చెందిందని, దాంతో తండా ప్రజలు భయాందోళ చెందినట్లు వసంత్, శివురాం, రవి, జైపాల్ తదితరులు తెలిపారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ సాధారణ జ్వరాలు మాత్రమేనన్నారు. శుక్రవారం కవిత అనే మహిళకు రక్త పరీక్షలు జరిపితే చికున్‌గున్యా నెగెటీవ్ వచ్చిందన్నారు. శనివారం ముగ్గురు మాత్రమే జ్వరంతో బాధపడుతున్నారని, వీరికి కూడా రక్తం నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపినట్లు చెప్పారు. చికున్‌గున్యా వ్యాధి లక్షణాలు ఏమాత్రం లేవని, ప్రజలు భయాందోళన చెందాలిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సంధ్యారాణి, ఎంఎల్‌హెచ్‌పీలు గణేశ్, విశాల్, సూపర్‌వైజర్ కమల, ఎంపీహెచ్ఏలు భాస్కర్, చంద్రబాబు, ఫార్మాసిస్ట్, పంచాయతీ కార్యదర్శి గౌతం, ఏఎన్ఎంలు సుజాత, అనిత, ఆశ వర్కర్లు ఉన్నారు. శనివారం రోగుల నుంచి సేకరించిన రక్తం నమూనాలను సంగారెడ్డి ల్యాబ్‌కు పంపగా నెగెటీవ్ వచ్చినట్లు మెడికలాఫీసర్ నాగమణి తెలిపారు.



వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

శ్రీవారి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

సదాశివపేట, మే 17: వెంకటాపూర్ శివారులోని వెంకటాచలం దివ్యక్షేత్రంలో వేంకటేశ్వర స్వామిని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీవారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అందరి సహకారంతో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. స్వామివారి ఆశీస్సులు అందరిపై ఉండాలని వేడుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శివరాజ్ పాటిల్, చింతా గోపాల్, కోడూరు ఆంజనేయులు, నాగేశ్, నరేశ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును ఉపసంహరించుకోవాలి

నల్లవల్లిలో రిలే నిరాహార దీక్ష చేస్తున్న జేఏసీ నాయకులు, మహిళలు

గుమ్మడిదల,మే17: ప్యారానగర్ డంపింగ్ యార్డును ఉపసంహరించుకోవాలంటూ నల్లవల్లి గ్రామస్తులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ శివారులో ఏర్పాటు కాబోతున్న డంపింగ్‌యార్డు (ఎంఎస్‌డబ్ల్యూ)ను రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం వెంటనే ఉపసంహరించుకోవాలని చేస్తున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి 102వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఇక్కడి గ్రామాల ప్రజలను డంపింగ్ యార్డు నుంచి రక్షించాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు.

బైక్ దొంగ అరెస్ట్

జహీరాబాద్ మే 17: జహీరాబాద్ పట్టణం పస్తాపూర్ కమాన్ వద్ద సిబ్బందితో కలిసి శనివారం ఉదయం వాహన తనిఖీలు చేస్తుండగా బీదర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న బైక్‌ను ఆపి సంబంధిత కాగితాలు అడగ్గా చూపించకపోవడంతో అనుమానం వచ్చి అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ కాశీనాథ్ తెలిపారు. ఇతడి పేరు కైలాస్ అని, తండ్రి అంబదాస్ కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ జిల్లా దేవాగిర్ తండాకు చెందినవాడని తెలిపారు. అతడి నుంచి మూడు బైక్‌లు స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

శివంపేట సొసైటీ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

చౌటకూర్, మే 17: రెండు రోజుల క్రితం కురిసిన అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు డిమాండ్ చేశారు. మండలంలోని శివంపేట పీఏసీఎస్ సొసైటీ వద్ద శనివారం ఆ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యం వర్షార్పణం కావడపై ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించినప్పటికీ, అధికారులు ప్రమత్తం కాకుండా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. ఫలితంగానే ఆరబెట్టిన ధాన్యంతోపాటు నింపిన బస్తాలు కూడా వర్షానికి తడిసిపోయాయని విచారం వ్యక్తం చేశారు. యాసంగి సీజన్ ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయినప్పటి నుంచి సొసైటీ అధికారులు, సిబ్బంది పూర్తి నిర్లక్ష్య ధోరణిని అవలంబించారని దుయ్యబట్టారు. ఫలితంగానే రైతులకు తీరని నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపుగా రెండు గంటలపాటు సొసైటీ ఎదుట సీపీఎం నాయకులు ఆందోళన చేపట్టడంతో తహసీల్దార్ అనుదీప్, ఏఈవో ప్రవీణ అక్కడి చేరుకున్నారు. తడిసిన ధాన్యాన్ని తప్పనిసరిగా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, ఇందులో రైతులకు ఎలాంటి అనుమానాలు వ్యక్తం చేయవద్దన్నారు. ధాన్యం తూకంలో కూడా తరుగు తీయరని, సక్రమంగా తూకం వేస్తారని వారు రైతులకు భరోసా ఇచ్చారు. దీంతో సీపీఎం నాయకులు ఆందోళనను విరమించారు. అంతకుముందు సొసైటీలో వర్షానికి తడిసిన ధాన్యాన్ని సీపీఎం నాయకులు పరిశీలించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సాయిలు, నాయకులు విద్యాసాగర్, నాగభూషణం, పుర్ర మల్లారెడ్డి, విఠల్, జైపాల్‌రెడ్డి, రాజేందర్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

మహీంద్రా అండ్ మహీంద్రా పరిశ్రమలో అగ్ని ప్రమాదం

పరిశ్రమలో మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

జహీరాబాద్, మే 17:జహీరాబాద్ సమీపంలోని మహీంద్రా అండ్ మహీంద్రా పరిశ్రమలో శుక్రవారం అర్ధరాత్రి భారీ అగ్ని ప్రమాదం జరిగింది. పరిశ్రమ అధికారులు, అగ్నిమాపక అధికారుల కథనం ప్రకారం..పరిశ్రమలోని ఆటోమోటిల్ డివిజన్ ప్లాంట్‌లోని స్టోర్ విభాగంలో ప్రమాదవశాత్తు మంటలు చలరేగాయి. దీంతో దట్టమైన పొగలు అలుముకోవడంతో సెక్యూరిటీ సిబ్బంది వెంటనే అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. సంబంధిత అధికారులు ఫైరింజన్‌లతో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజామున 4గంటల వరకు ఐదు ఫైరింజన్లతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. రాత్రి సిఫ్ట్ నడపకపోవడంతో ఉద్యోగులు, కార్మికులకు పెను ప్రమాదం తప్పింది. అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు ఉన్న పరిశ్రమలో అగ్ని ప్రమాదాలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నప్పటికీ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం చోటుచేసుకోవడం, పెద్ద ఎత్తున ఆస్తి నష్టం సంభవించిందని పరిశ్రమ అధికారులు, స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమలో భారీగానే ఆస్తి నష్టం జరిగినట్టు పరిశ్రమ అధికారులు పేర్కొంటున్నారు.

సామాజిక తనిఖీలో రికవరీకి ఆదేశం

ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రజాదర్బార్‌లో వివరాలు వెల్లడిస్తున్న డీఆర్పీలు

జహీరాబాద్, మే 17: ఉపాధి హామీ పథకంలో చేపట్టిన అభివృద్ధి పనులు, కూలీలకు సంబంధించిన సామాజిక తనిఖీలో రూ. 46,990 రికవరీకి డీఆర్‌డీఏ ఏపీడీ బాల్‌రాజ్ ఆదేశించారు. శనివారం జహీరాబాద్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉపాధి హామీ పథకం కింద గతేడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2025 మార్చి 31 వరకు చేపట్టిన అభివృద్ధి పనులు, కూలీలకు సంబంధించి మండలంలోని ఆయా గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందాలు చేపట్టిన ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా అభివృద్ధి పనులు, కూలీలకు సంబంధించిన పనుల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయని, వాటికి సంబంధించి పీఆర్‌లో రూ.27,139, ఉపాధి హామీలో 19,851 అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీ బృందాలు వెల్లడించారు. కార్యక్రమంలో ఏపీడీ పూజ, ఎంపీడీవోఐ మహేందర్‌రెడ్డి, డీవైవో నాగేశ్వర్‌రావు, అంబుజ్‌మెంట్ భోజిరెడ్డి, పీఆర్ఏఈ నవీన్, ఏపీవో అశోక్‌కుమార్ తదితర